క్లుప్తంగా

సీతమ్మధార రైతుబజార్‌ను సందర్శించిన సీఈవో



స్టాళ్ల వద్ద పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ సీఈవో మాధవీలత

తాటిచెట్లపాలెం: సీతమ్మధార రైతుబజార్‌ను గురువారం మార్కెటింగ్ శాఖ సీఈవో మాధవీలత సందర్శించారు. రైతుబజార్లకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న కర్నూలు ఉల్లిపాయల స్టాళ్ల వద్దకు వెళ్లి వాటి నాణ్యత, ధరలను ఆమె పరిశీలించారు. బజార్‌లోని రైతులు, వినియోగదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సీఈవో వెంట రైతుబజార్ జాయింట్ డైరెక్టర్ సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస కిరణ్, మార్కెట్ కమిటీ సెక్రటరీ రవికుమార్, రైతుబజార్ ఈవో కృష్ణమూర్తి, సహాయకుడు సతీష్ ఉన్నారు.

వర్షా కాలం వ్యాధులపై అప్రమత్తం



నందగిరినగర్‌లో రక్త పరీక్షలు చేస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మణ్

సీతంపేట: వర్షా కాలంలో వచ్చే వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మలేరియా హెల్త్ సూపర్‌వైజర్ జి.లక్ష్మణ్ అన్నారు. 43వ వార్డు నందగిరినగర్‌లో సచివాలయం, జీవీఎంసీ సిబ్బందితో కలిసి గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, లేదంటే దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా జ్వరాలను కలుగజేస్తాయన్నారు. నీటిని కాచి చల్లార్చి తాగాలని, చలి, జ్వరం, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే సమీప పట్టణ ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. దోమలు పెరిగే ప్రదేశాలు, వాటి నియంత్రణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కొట్నీ శ్రీనివాసు, జీవీఎంసీ మలేరియా సూపర్‌వైజర్ సిహెచ్.పద్మప్రియ, ఏఎన్‌ఎం ఎస్.కృష్ణకుమారి, ఆశ కార్యకర్త పి.స్వాతి పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం



మృతుడు నాగరాజు భార్యకు ఆర్థిక సాయం అందిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెబాస్టియన్ కాలనీలో నివసిస్తున్న బొద్దాన నాగరాజు అనారోగ్యంతో మరణించాడు. ఆ కుటుంబానికి ఆసరాగా నిలవాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ నేతృత్వంలో గురువారం సాయంత్రం నాగరాజు భార్య బొద్దాన దేవి కుటుంబాన్ని పరామర్శించారు. ఆమెకు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ చేతుల మీదుగా రూ.5 వేలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ మృతుడు నాగరాజు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నప్పుడు వైద్య ఖర్చులకు ఆర్థికంగా ఆదుకున్నామన్నారు. బాధిత కుటుంబానికి ఏ సమస్య వచ్చినా వైఎస్సార్‌సీపీ తరఫున అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బొండాల రామారావు, అర్సాడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకం



దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవ లో పలువురు ఉభయ దాతలు పాల్గొనగా.. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. రూ.1,000 పూజా రుసుం చెల్లించి భక్తులు ఈ పూజలో పాల్గొనవచ్చు. పరోక్ష పద్ధతిలో ఈ పూజ చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో రుసుం చెల్లించవచ్చు.

రాకపోకలెలా..?



బిర్లా కూడలి సర్వీస్ రోడ్డులో ఓ షోరూం వద్ద బారులు తీరిన కమర్షియల్ వాహనాలు

- హైవే సర్వీస్ రోడ్డులో ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహన చోదకులు
- ట్రాఫిక్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా.. స్పందన శూన్యం

మర్రిపాలెం: జాతీయ రహదారి వెంబడి గ్రీన్‌బెల్ట్‌ను ఆనుకున్న సర్వీస్ రోడ్డులో ఇష్టానుసారంగా వాహనాలు నిలిపివేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తి ప్రజలు ఇబ్బంది పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్వీస్ రోడ్డులో నెలల తరబడి ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను పార్క్‌చేసే వదిలేస్తున్నా.. ట్రాఫిక్ పోలీసుల నుంచి ఎటువంటి చర్యలు లేవు. హైవేలో తాటిచెట్లపాలెం జంక్షన్ మొదలుకుని బిర్లా, పంజాబ్ హోటల్, ఆర్ అండ్ బీ జంక్షన్ల వరకు సర్వీస్ రోడ్డు మొత్తం ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాల పార్కింగ్‌తో నిండిపోయి ఉండటంతో అటుగా ప్రయాణాలు సాగించే స్థానికులు, వాహన చోదకులు, పాదచారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిబంధనలు బేఖాతర్..!

నిబంధనల ప్రకారం సర్వీస్ రోడ్డులో వాహనాలు నిలపడానికి వీల్లేదు. ఒక వేళ నిలిపినా కొన్ని గంటల్లో లేదా ఒక రోజులో తీసేయాలి. అలా కాకుండా నెలల తరబడి కార్ల కంపెనీల ఎదురుగా వారి కమర్షియల్ వాహనాలు, కార్లు, వారి సిబ్బంది బైకులు, కష్టమర్ల వాహనాలను సర్వీస్ రోడ్డుపైనే పార్కింగ్ చేసి ఉంచడంతో సామాన్యులు తంటాలు పడుతున్నారు. నిబంధనలు బేఖాతర్ చేస్తూ సర్వీస్ రోడ్డులో ట్రాన్స్‌పోర్ట్, ఇతర వాహనాలను నిలిపి ఉంచుతున్నా.. ట్రాఫిక్ పోలీసులు కనీసం పట్టించుకోవడం లేదని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో సర్వీస్ రోడ్డులో బారులు తీరుతున్న వాహనాల వల్ల నిత్యం ఇబ్బందులు పడుతున్నామని వాహన చోదకులు, పాదచారులు వాపోతున్నారు.



పంజాబ్ హోటల్ జంక్షన్‌కు ఆనుకుని సర్వీస్ రోడ్డులో పార్క్ చేసిన వాహనాలు



బిర్లా జంక్షన్ సమీపంలోని ఓ వాహనాల షోరూం వద్ద సర్వీస్ రోడ్డుపై అడ్డదిడ్డంగా పార్కింగ్

ట్రాఫిక్ పోలీసుల చర్యలేవి..?

ట్రాఫిక్ పోలీసులకు కేసుల నమోదు, జరిమానాల వసూళ్లపై ఉన్న శ్రద్ధ.. ట్రాఫిక్ నియంత్రణపై లేదని పలువురు వాహన చోదకులు విమర్శిస్తున్నారు. హెల్మెట్ పెట్టుకోకపోతే జరిమానా కట్టండని రోడ్లపై గంటల తరబడి ద్విచక్ర వాహనాలను నిలిపేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, సర్వీస్ రోడ్లపై భారీ వాహనాలను పార్క్‌చేస్తున్న బడా కంపెనీలపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తున్న వారిపై తగు చర్యలు తీసుకుంటే బాగుంటుందని సూచిస్తున్నారు. ట్రాఫిక్ పోలీస్ అధికారులు దృష్టి సారించి సర్వీస్ రోడ్లపై వాహనాల రాంగ్ పార్కింగ్‌ను నిరోధించాలని, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



ఆర్ అండ్ బీ జంక్షన్ అంబేడ్కర్ భవన్ సమీపంలోని సర్వీస్ రోడ్డు మధ్యలో నిలిపిన వాహనాలు

బాలబాలికలతో కలిసి ప్రో కబడ్డీ వీక్షించిన సీపీ



ప్రో కబడ్డీ మ్యాచ్ వీక్షిస్తున్న స్వచ్ఛంద సంస్థల బాలబాలికలతో సీపీ బాగ్చి

అల్లిపురం: పోర్టు ఇండోర్ స్టేడియంలో గురువారం జరిగిన ప్రో కబడ్డీ మ్యాచ్‌ను 24 మంది స్వచ్ఛంద సంస్థల బాలబాలికలతో కలిసి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వీక్షించారు. స్వచ్ఛంద సంస్థల్లో ఉంటున్న బాలబాలికలకు ప్రో కబడ్డీని వీక్షించే అవకాశం కల్పించాలని ఆయన పాపాహోం విద్యార్థులతో కలిసి వారికి పాస్‌లు ఏర్పాటు చేశారు. చిన్నారులతో కలిసి సీపీ మ్యాచ్‌ను వీక్షిస్తూ ముచ్చటించారు. ఇటువంటి అరుదైన అవకాశం కల్పించిన పోలీస్ కమిషనర్‌కు బాలబాలికలు ధన్యవాదాలు తెలియజేశారు. ఆయనతో కలిసి ఫొటోలు దిగుతూ సందడిగా గడిపారు.

వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్తకు భరోసా

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం బాబూ కాలనీలో నివసిస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్త కండి పుష్ప కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వార్డు పర్యటనలో గురువారం కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ పుష్ప నివాసానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పార్టీ తరఫున అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ నెల రోజులకు సరిపడా బియ్యం, నిత్యావసర సరకులు, వైద్య ఖర్చులకు రూ.5 వేలు నగదును పుష్పకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, వేళంగిణీరావు, పాత్రపల్లి సునీల్‌కుమార్, రాజు, మధు, ఈశ్వరి, దేవి, అన్నపూర్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ సంరక్షణ



విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్, వెంకటలక్ష్మి

సీతంపేట: పర్యావరణ పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై పిల్లల్లో అవగాహన పెంపొందించడానికి పాఠశాలల్లో ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్, ట్రీ ప్లాంటేషన్ ప్రాజెక్ట్ ప్రారంభిస్తున్నట్టు మహిళా చైతన్య స్రవంతి చైర్‌పర్సన్ డి.వెంకటలక్ష్మి తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ శ్రీకృష్ణ విద్యా మందిర్‌లో పర్యావరణ సంరక్షణకు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. విశాఖపట్నం అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల నీటి మట్టాన్ని పెంచడం, సహజ వనరులను రక్షించడం, దీర్ఘకాలిక వాతావరణ పరిస్థితులను మెరుగుపరచవచ్చన్నారు. ప్రతి విద్యార్థికి వారి ఇంట్లో నాటడానికి ఒక మొక్కను అందజేస్తామని చెప్పారు. విద్యార్థులు తమ తరగతి ఉపాధ్యాయులకు పిల్లలు నాటిన మొక్క తాలూకా నెలవారీ పెరుగుదల నివేదికను సమర్పిస్తారన్నారు. మహిళా చైతన్య స్రవంతి ఏటా మొక్కల పెరుగుదలను సమీక్షిస్తుందన్నారు. విద్యార్థులకు వెయ్యి లెగస్ట్రోమియా మొక్కలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షురాలు డి.రామలక్ష్మి, జాయింట్ సెక్రటరీ పి.స్వాతి, వైస్ ప్రిన్సిపాల్ ఎ.నరసింగరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగరంలో పారిశుధ్యం మెరుగుకు కృషి

- ఉదయం 6 నుంచే అధికారులు, సిబ్బంది విధుల్లో ఉండాలి
- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్
- జోన్-3, 4ల్లో క్షేత్ర పర్యటన



రామలక్ష్మి అపార్ట్‌మెంట్ వద్ద రోడ్డును ఆక్రమించిన కూరగాయల దుకాణాన్ని తొలగించాలని జెడ్సీకి ఆదేశిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

దాబాగార్డెన్స్: ప్రజారోగ్యం దృష్ట్యా నగర పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా గురువారం జోన్-3, 4 జోనల్ కార్యాలయ పరిధిలోని 19, 20, 30 వార్డుల్లో ఆయన పర్యటించారు. ముందుగా జోన్-4 పరిధి 30వ వార్డు జగదాంబ జంక్షన్, లేపాక్షి జంక్షన్, పూర్ణా మార్కెట్ తదితర ప్రాంతాల్లో పర్యటించి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, పారిశుధ్య కార్మికుల హాజరును ఫోన్‌లో పరిశీలించారు. వ్యర్థాలు చాలా చోట్ల కనిపిస్తున్నాయని, విధుల్లో అలసత్వం వహించరాదని వారికి సూచించారు. ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది ఉదయం 6 గంటల నుంచే విధుల్లో ఉండేలా చర్యలు చేపట్టాలని అన్ని జోన్ల కమిషనర్లను వాకీటాకీ ద్వారా ఆదేశించారు. పలువురు పారిశుధ్య కార్మికులను వారి విధులు, హాజరును అడిగి తెలుసుకున్నారు.

వ్యాపారులకు వెండింగ్ జోన్‌లో అవకాశం

అనంతరం జోన్-3 పరిధి ఉషోదయ జంక్షన్ నుంచి రామలక్ష్మి అపార్ట్‌మెంట్ వరకు కమిషనర్ పర్యటించారు. డ్రోన్ ద్వారా ఆయన పరిశీలించగా వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ అధికంగా కనిపిస్తున్నాయని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రామలక్ష్మి అపార్ట్‌మెంట్ వద్ద రోడ్డును ఆక్రమించి కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారి దుకాణం తొలగించి, ప్రతి జోన్‌లో ఏర్పాటు చేస్తున్న వెండింగ్ జోన్‌లో వారికి ఒక దుకాణం కేటాయించాలే చూడాలని జోనల్ కమిషనర్ శివప్రసాద్‌ను ఆదేశించారు. ఉషోదయ జంక్షన్‌లోని ఫ్రీ లెఫ్ట్‌లో ఆక్రమణలో ఉన్న బడ్డీలు వెంటనే తొలగించి, ఆ చిరు వ్యాపారులకు వెండింగ్ జోన్‌లో అవకాశం కల్పించాలని, కూడలిలో వాహనాల రాకపోకలకు ఫ్రీ లెఫ్ట్‌లో 50 మీటర్ల వరకు ఆక్రమణలు లేకుండా చూడాలని ఆదేశించారు. అక్కడ నూతనంగా నిర్మిస్తున్న భవనాల యజమానులు నిర్మాణ సామగ్రిని రోడ్డుపై వేయకుండా చర్యలు తీసుకోవాలని సిటీ ప్లానర్‌ను ఆదేశించాలని జెడ్సీకి సూచించారు. నిత్యం అధికారులు వార్డుల్లో పర్యటిస్తూ పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాలన్నారు. పర్యటనలో ఏఎంహెచ్‌వో డాక్టర్ ఒ.బి.ప్రసాదరావు, శానిటరీ సూపర్‌వైజర్ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు అచ్యుత్, రాంబాబు

బీచ్‌రోడ్డు: చంద్రబాబు అధికారంలోకి వచ్చిన 15 నెలల వ్యవధిలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌కు అప్పగించేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.అచ్యుత్, వై.రాంబాబు ధ్వజమెత్తారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పోరాటం జరగాల్సిన అవసరముందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రైవేటీకరణ ప్రక్రియను వేగవంతం చేసినట్లే, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు అదే దారిలో నడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా, వైద్య రంగాలను పూర్తిగా ప్రైవేటు పరం చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. పర్యాటక రంగంలో రూ.10 వేల కోట్ల విలువైన 22 హోటళ్లు, రిసార్ట్‌లు, ఆస్తులను ప్రైవేట్‌పరం చేయడం దారుణమన్నారు. తాజాగా 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరణకు అప్పగించడం అత్యంత దుర్మార్గమన్నారు. ఆదోని, మదనపల్లె, మార్కాపురం, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం కళాశాలలు ఈ జాబితాలో ఉన్నాయని వివరించారు. విజయవాడ గవర్నరుపేట ఆర్టీసీ డిపోతోపాటు, విశాఖలోని ఆర్టీసీ స్థలాలను లూలూ సంస్థకు అప్పగించేందుకు తీసుకున్న నిర్ణయం కూడా ఇదే కోవలోదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పాఠశాలల నుంచి ఇంటర్, ఇంజినీరింగ్, వైద్య కళాశాలలు, విశ్వవిద్యాలయాలన్నీ ప్రైవేటు మయమైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ విద్య అంటే వీఐటీ, ఎస్‌ఆర్‌ఎం, కేఎల్యూ, గీతం వంటి ప్రైవేట్ యూనివర్సిటీల పేర్లే వినిపిస్తున్నాయని, ఇంటర్ విద్య అంటే నారాయణ, చైతన్య కళాశాలలే గుర్తుకొస్తున్నాయని ఎద్దేవా చేశారు. విద్యా శాఖ మంత్రిగా నారా లోకేశ్‌ను నియమించి నప్పటికీ ఫలితం లేదని, మొత్తం విద్యా, వైద్య రంగాలను ప్రైవేట్‌కు అప్పగించడం తగదని వ్యాఖ్యానించారు. సమావేశంలో మధురెడ్డి, భీమరాజు పాల్గొన్నారు.

13 నుంచి గర్భాశయ క్యాన్సర్ నివారణ వ్యాక్సినేషన్

మహారాణిపేట: ఆడపిల్లలకు గర్భకోశ ముఖద్వార క్యాన్సర్ రాకుండా ఉండేందుకు ఈ నెల 13 నుంచి 16 వరకు సీతమ్మధారలోని లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రిలో ఉచిత వ్యాక్సినేషన్ శిబిరం నిర్వహిస్తున్నట్లు చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు, లయన్స్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ షిరీన్ రెహమాన్ తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో 9 నుంచి 14 ఏళ్ల వయసు లోపు బాలికలకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్ ఉచితంగా వేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే 600 మంది ఆడపిల్లలు తమ పేర్లు రిజిస్టర్ చేసుకున్నారని, వారంతా నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న శిబిరాన్ని సందర్శించి టీకా వేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు హాజరవుతారన్నారు. ఇదివరకు మొదటి డోస్ వేసుకొని ఆరు నెలల సమయం గడిచిన వారికి రెండో డోస్ వేసుకునే అవకాశం కల్పిస్తున్నామని డాక్టర్ షిరీన్ రెహమాన్ తెలిపారు.

టైలరింగ్ యూనిట్ ప్రారంభం

అల్లిపురం: నగర పోలీస్ కమిషనరేట్‌లోని ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆవరణలో గల టైలరింగ్ సెంటర్‌ను గురువారం పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. కొన్నేళ్లుగా ఈ భవనం పాక్షికంగా శిథిలమవడంతో కుట్టుమిషన్లు, యూనిఫామ్‌లు తడిసిపోయేవి. ఈ విషయం సీపీ దృష్టికి రావడంతో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసేందుకు అనుమతులు మంజూరు చేశారు. యూనిట్‌కు ఏసీతోపాటు నూతన యంత్రాలు సమకూర్చారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన పథకాలతో ప్రయోజనాలు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖలీగల్: పేదరిక నిర్మూలన పథకాల వల్ల ఎన్నో ప్రయోజనాల ఉన్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఎ) కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. గురువారం జిల్లా కోర్టు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పట్టణ పేదలకు పథకాలు అందించడంలో మెప్మా, డీఆర్‌డీఏ పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఏడీ సత్యపద్మ, డీఆర్‌డీఏ, జిల్లా పరిషత్ అధికారులు, కె.శంకరరావు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం పరిశీలన



పాఠశాల భవనం పైభాగాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధిలోని రామ్మూర్తిపంతులపేట ఉన్నత పాఠశాల భవనాన్ని కార్పొరేటర్ రాజశేఖర్, ఎంపీ శ్రీభరత్ ముఖ్య కార్యదర్శి ఏపూరి రాజేశ్ జోన్-5 ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. సుమారు 50 ఏళ్లనాటి ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో వర్షాలు పడినప్పుడు శ్లాబులు, గోడల నుంచి నీరు కారుతోంది. శ్లాబ్ పెచ్చులూడి పడిపోతుండటంతో భవనం పరిస్థితిని వివరిస్తూ ప్రధానోపాధ్యాయిని ఎం.రాజ్యలక్ష్మి జిల్లా విద్యాశాఖాధికారులకు, విశాఖ ఎంపీ శ్రీ భరత్‌కు, ఎమ్మెల్యే పి.గణబాబుకు, వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ నేపథ్యంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు గురువారం పాఠశాలను సందర్శించారు. ఎంపీ నిధులతో పాఠశాలను అభివృద్ధి చేస్తామని, భవనం పునర్నిర్మాణానికి కావలసిన అంచనా విలువను వేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.

నరికేశారు.. వదిలేశారు



బృందావన్ అపార్ట్‌మెంట్ వద్ద నరికి వదిలేసిన చెట్ల కొమ్మలు



మురళీనగర్ ఎస్ఆర్ ఫంక్షన్ హాల్ రోడ్డుపై వదిలేసిన కొమ్మలు

మురళీనగర్: ఏపీఈపీడీసీఎల్ శాఖ మురళీనగర్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల్లో భాగంగా చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది వీటిని ఆయా ప్రాంతాల నుంచి తొలగించడం లేదు. గతంలో ఎన్నోసార్లు వీరు చెట్ల కొమ్మలు తొలగించిన చోటే వదిలేయడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయంపై 'సాక్షి'లో కథనాలు ప్రచురించినా వీరు మారడం లేదు. ఎప్పటి మాదిరిగానే ఇటీవల విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా మురళీనగర్ సెక్టార్-7 పరిసరాల్లో చెట్ల కొమ్మలను నరికారు. మురళీనగర్ బృందావన్ అపార్ట్‌మెంట్, ఎస్ఆర్ ఫంక్షన్ హాల్ రోడ్డులో కొమ్మలు వారం రోజులుగా తొలగించిన చోట పడి ఉన్నాయి. ఇవి వర్షాలకు కుళ్లి దోమలు వ్యాప్తిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు తక్షణం స్పందించి కొమ్మలను తరలించాలని కోరుతున్నారు.

గెడ్డపై పాత బ్రిడ్జి తొలగింపు



జగన్నాథపురంలో గెడ్డపై తొలగిస్తున్న పాత బ్రిడ్జి



నందగిరినగర్ డ్రెయిన్‌లో పూడికతీత పనులు

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డులో పలు చోట్ల అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల రూ.1.71 కోట్లతో వార్డులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా జగన్నాథపురం గెడ్డపై శిథిలమైన పాత బ్రిడ్జిని తొలగించి కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారు. రెండు రోజులుగా ఈ పనులు జరుగుతున్నాయి. నందగిరినగర్‌లోని సేవా సంఘం రోడ్డులో పూడుకుపోయిన డ్రెయిన్ తొలగించి కొత్త కల్వర్టు నిర్మిస్తున్నారు. డ్రెయిన్ మొత్తం సిల్ట్, మట్టితో నిండిపోవడంతో దానిని తొలగిస్తున్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్స్ మంజూరుపై సమీక్ష



మాట్లాడుతున్న డీడీ రామారావు

ఎంవీపీ కాలనీ: జిల్లాలోని పోస్ట్‌మెట్రిక్ స్థాయి విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్స్ మంజూరుపై జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఎంవీపీ కాలనీ సమత కళాశాలలో జరిగిన సమీక్షలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామారావు పాల్గొని ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించిన కళాశాలల ప్రిన్సిపల్స్, వెల్ఫేర్ అసిస్టెంట్స్, సచివాలయాల కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 61 వేల మంది విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్‌కు అర్హులన్నారు. వివిధ కారణాల వల్ల సగానికిపైగా విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందలేదన్నారు. సచివాలయాల లాగిన్స్, ప్రిన్సిపల్ లాగిన్స్‌తోపాటు బయోమెట్రిక్ సమస్యలు కారణంగా ఆయా దశల్లో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. వీటిలో సచివాలయాల స్థాయిలో 20 వేలు, ప్రిన్సిపల్స్ స్థాయిలో 3,850, బయోమెట్రిక్, ఇతర సమస్యలతో 11,950 వేల అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఆయా దరఖాస్తులను త్వరితగతిన ప్రోసెస్ చేయాలని సూచించారు. అవసరమైన 5 స్టెప్స్ వెరిఫికేషన్స్‌పై మరోసారి అవగాహన కల్పించారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.